www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 మే 2023
5
తూర్పుగోదావరి



నెలాఖరు నాటికి పూడికతీత పనుల పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వర్షాకాలం మొదలవ్వక ముందే మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించే ప్రక్రియ నూరుశాతం పూర్తి అవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కోటిపల్లి బస్టాండ్, కుమారి టాకీస్ రోడ్, గోదావరి గట్టు, దేవి చౌక్ ప్రాంతాల్లో జరుగుతున్న డీ సిల్టేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. మ్యాన్‌హోల్ ఉన్నచోట కాకుండా కాలువ మొత్తం పూడిక తీత ప్రక్రియ చేయాలన్నారు. తీసిన సిల్ట్‌ని ఎప్పటికప్పుడు టిప్పర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. మురుగు కాలువల పూడికతీత వల్ల ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలుగరాదన్నారు. ఆయన వెంట శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, ఎంహెచ్‌ఒ వినుత్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐసితో అయోమయం

- పారదర్శకత కోసం తెచ్చిన సాఫ్ట్‌వేర్‌తో తప్పని చిక్కులు
- కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఉపాధికి తూట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధి హామీ చట్టం అమల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఐసితో అయోమయ పరిస్థితి నెలకొంది. ఏడాదిలో 100 రోజుల పాటు ప్రతి నిరుపేద కుటుంబానికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వామపక్ష పార్టీలు చేసిన పోరాట ఫలితంగా యుపిఎ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి నిధుల కేటాయింపును క్రమంగా తగ్గించింది. దీంతో పాటూ పారదర్శకత పేరుతో అమల్లోకి తెచ్చిన ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ కొత్త సమస్యలకు కారణమవుతోంది. ఈ సాఫ్ట్‌వేర్‌లో కఠినమైన నిబంధనలుండడంతో క్షేత్రస్థాయిలో ఉపాధి చట్టానికి తూట్లు పడుతున్నాయి. ఇప్పటికే వేసవిలో అందించే సమ్మర్ అలవెన్సులకు కోత విధించింది. రోజుకు రెండు సార్లు మస్టరు విధానం అమల్లోకి తీసుకురావడం, బ్యాంకు ఖాతాల ఆధునీకరణ, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లపై మరింత పనిభారం పడేలా మారాయి. ముఖ్యంగా రెండుసార్లు మస్టర్ల విధానం అమల్లోకి రావడంతో వేసవిలో సైతం ఉపాధి కూలీలు పని ప్రదేశాలలో 4 నుంచి 6 గంటల పాటు వేచి చూడాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

మేట్ల సంఖ్య కుదింపుతో ఇబ్బందులు

గతంలో ఉపాధి హామీ పథకంలో తాత్కాలికంగా పదిమందికి పైగా ఉన్న ఒక గ్రూపునకు, శాశ్వతంగా 25 మందికిపైగా ఉన్న గ్రూపునకు ఒక మేటు ఉండేవారు. వీరి ద్వారానే ఉపాధి పనులను కూలీలకు చేరేవి. ఈ మేటు క్షేత్రస్థాయిలో కూలీలు చేయాల్సిన పనుల కొలతలను సూచిస్తూ రోజువారీగా కూలీల హాజరు వివరాలను నమోదు చేస్తూ ఉండేవారు. ఇలా ఒక్కో గ్రామంలో సుమారు 20 నుంచి 80 మంది వరకు మేట్లు పనులను పర్యవేక్షించేవారు. ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌లో ఒక్కొక్క మేటు మూడు నుంచి ఐదు గ్రూపులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న పనుల వివరాలను రోజుకు రెండు సార్లు ఆన్‌లైన్‌లో(ఎన్ఎంఎంఎస్) అప్‌లోడ్ చేస్తున్నారు. ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటల తర్వాత మస్టర్లు వేస్తున్నారు. ఎండలు మండుతున్న ఈ సమయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఐదున్నర గంటల వరకు పనులు చేయాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు ఎండలో అవసరమైతే తప్ప బయటకు రావొద్దని చెబుతున్న ప్రభుత్వాలు ఈ ఎన్ఐసి ద్వారా హాజరును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధన పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల ఎండలో 12 గంటల వరకూ ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిట్టల వేమవరంలో ఎండలోనే పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌తో కొత్త చిక్కులు

ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పేరుతో గతేడాది కొత్త సాఫ్ట్‌వేర్ అమల్లోకి తీసుకొచ్చారు. ఈ సాఫ్ట్ వేర్ కారణంగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అభిప్రాయం కూలీలలోనూ, సిబ్బందిలోనూ వ్యక్తమవుతోంది. గతంలో ఉపాధిహామీ పథకంలో ఒక గ్రూపు పనికి వెళ్లాలంటే సంబంధిత గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ ద్వారా పని కోసం డిమాండ్ దరఖాస్తును చేసేవారు. కాని ఇప్పుడు ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత ఖచ్చితంగా మండల కంప్యూటర్ సెంటర్ నుంచి (ఎంసీసీ) మాత్రమే పని కోసం డిమాండ్ దరఖాస్తును చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకసారి డిమాండ్ ఆ తర్వాత పని కేటాయింపు, ఆ తర్వాత మస్టరు జనరేట్ చేయడం లాంటి పనులు ఎన్ఐసి ద్వారానే నిర్వహించాల్సి వస్తోందని కంప్యూటర్ ఆపరేటర్లు వాపోతున్నారు. పైగా గతంలో ఒక గ్రామ పంచాయతీకి సంబంధించి ఒక్కటే మస్టరు జనరేట్ అయ్యేది ఇప్పుడు మాత్రం ప్రతిగ్రూపు గ్రూపుకు మస్టరు జనరేట్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. బ్యాంకు, పోస్టల్‌ఖాతాలను ఆధునీకరించి అకౌంట్‌లు జనరేట్ చేశామని చెబుతున్నారు. ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ కొత్త చిక్కులు తెచ్చిపెట్టిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సిబ్బందిపై తప్పని పనిభారం

జిల్లాలో 1.89 లక్షల జాబ్‌కార్డులుండగా 2.96 లక్షల మంది ఉపాధి హామీ కూలీలున్నారు. ఇందులో 1.23 లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉండగా 1.8 లక్షల మంది కూలీలు పనులకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 30 నుంచి 80 వరకు ఉపాధి హామీ గ్రూపులున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రం మండలానికి ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. ప్రతి రోజూ పని డిమాండ్, పని కేటాయింపు, మస్తరు జనరేట్, పేమెంట్స్ చేయడంలో వీరికి కీలక పాత్ర. సిబ్బంది కొరత కారణంగా రాత్రి వేళల్లోనూ పనిచేయాల్సిన పరిస్థితి. మరోపక్క గ్రామాల్లో పనులను పర్యవేక్షించి కొలతలను స్వీకరించాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు కూడా తక్కువగా ఉండడంతో ఒక్కొక్కరికి పది గ్రామాలకు ఇన్‌ఛార్జిలుగా అదనపు భారం పడుతోంది. కొత్త సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చేలా లేదని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



మస్తర్లు వేసేందుకు ఇబ్బందులు

ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌తో క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నెల 17న మస్తర్ల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. దేశ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ సమస్య ఉందని అధికారులు తెలిపారు. కొన్ని సార్లు ఏ గ్రూపులో పేరు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. ఒక్కరే మేటు రెండు లేక మూడు గ్రూపులను పరిశీలించి ఫొటో అప్‌లోడ్ చేయాల్సి రావడంతో పని భారం పెరిగింది. పాతపద్ధతిలో మస్తర్లు వేయాలి, లేదా సాఫ్ట్‌వేర్‌లో వెసులుబాటు కల్పించాలి.

- అంబటి రమణ. ఫీల్డ్ అసిస్టెంట్



మస్తర్ల కోసం ఎండలోనే పడిగాపులు

గ్రామంలో చెరువు పూడిక తీత పనులు 2 వారాల నుంచి చేస్తున్నాం. పూడిక మస్తరు కోసం రెండుసార్లు ఫొటో అప్‌లోడ్ చేయాలంటే పని ప్రదేశంలో ఎండలో ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. ఉన్నతాధికారులు చొరవ చూపించాలి. పాత పద్ధతిలో మస్తర్ల విధానం అమల్లోకి తీసుకురావాలి.

- జి.లక్షణరావు, ఉపాధి కూలీ, పిట్టల వేమవరం



పర్యటనా ప్రాంతాలను పరిశీలిస్తున్న హోం మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత తదితరులు

24న సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఈ నెల 24న కొవ్వూరులో సిఎం జగన్ పర్యటించనున్నారు. 'జగనన్న విద్యా దీవెన' రాష్ట్ర స్థాయి వేడుకలు ఇక్కడ నిర్వహించనున్నట్లు హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. సోమవారం కొవ్వూరులో సిఎం పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ సిఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రదేశాలను పరిశీలించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశామని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త, ఎంఎల్‌సి తలశిల రఘురాం తెలిపారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ సిఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమన్వయంతో సిఎం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు, వాహనాల మళ్లింపు, పార్కింగ్ తదితర వివరాలను ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెసి ఎన్.తేజ్‌భరత్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఇతర జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు.

మహానాడు జయప్రదానికి కసరత్తు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే టిడిపి మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ ముఖ్య నాయకులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక మోరంపూడి సెంటర్‌లో ఉన్న గన్నీస్ శుభమస్తు ఫంక్షన్ హాల్లో ఆ పార్టీ నాయకులు ఈ మేరకు బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎంఎల్‌సి పరుచూరి అశోక్‌బాబు, మాజీ ఎంఎల్‌ఎలు జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆరుమిల్లి రాధాకృష్ణ, పార్టీ కార్యాలయ కార్యదర్శి రమణ, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వెలుగుబంటి ప్రసాద్, మరుకుర్తి రవియాదవ్, కోరుమిల్లి విజయశేఖర్, సంసాని ప్రసాద్, వలవల బాబ్జి తదితరులు పాల్గొన్నారు. మహానాడు నిర్వహణా కమిటీల పనిపై చర్చించారు. మహానాడు నిర్వహణ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్ల విషయంలో ఎవరూ అలసత్వం వహించరాదని, విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అక్షయ్‌రామ్‌కు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-గోకవరం

తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న గోకవరం గ్రామానికి చెందిన బాలుడు అక్షయ్ రామ్‌కు మెరుగైన వైద్య సాయం అందజేస్తామని వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు తెలిపారు. గురువారం గోకవరం ఎంపిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్షయరామ్ వైద్య సాయం నిమిత్తం వారి తల్లిదండ్రులు పలుచోట్ల ఆసుపత్రులు తిరిగారని ఎక్కడా సాయం అందలేదన్నారు. ఈ విషయం తనవద్దకు వచ్చిందన్నారు. అక్షయ్ రామ్ ఆరోగ్య పరిస్థితి గురించి కాకినాడ ఎంపీ వంగా గీతాకు, ఎంఎల్‌ఎ జోతుల చంటిబాబు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. స్పందించిన ఎంపీ వంగా గీత బాలుడు వైద్యం నిమిత్తం రూ.3 లక్షలు మంజూరు చేశారన్నారు. ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు కలెక్టర్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం చేయించడానికి రూ.11 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో బాలుడిని శనివారం హైదరాబాదులోని బసవ తారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎంఎల్‌ఎ, కలెక్టర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, కర్రి సూరారెడ్డి, వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్.నరసయ్య, టి.రాంప్రసాద్, ఎం.సతీష్, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగ సంఘాల

గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తపాల శాఖను ప్రయివేటీకరణ చేయకుండా పోరాటాలు చేస్తున్న జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య(ఎన్ఎఫ్‌పిఇ), అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం(ఎఐపిఇయుపి) గుర్తింపు రద్దు ఆర్డరును వెంటనే వెనక్కి తీసుకోవాలని సంఘం రాజమండ్రి డివిజన్ కార్యదర్శి బి.కొండబాబు కోరారు. తపాల ఉద్యోగ సంఘాల గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తూ స్థానిక రాజమండ్రి ప్రధాన తపాలా కార్యాలయం వద్ద మధ్యతరగతి, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి మాట్లాడారు. కేంద్రం తెచ్చిన నూతన రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమానికి ఆర్థిక సాయం చేశారనే కారణంగా ఈ రెండు యూనియన్ల గుర్తింపును రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాల అణచివేత చర్యల్లో భాగంగానే కేంద్ర ప్రభుత్వం యూనియన్ల రద్దుకు పూనుకుందని విమర్శించారు. ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ సౌత్ జోనల్ అధ్యక్షులు పి.సతీష్ మాట్లాడుతు స్వాతంత్ర్యానికి ముందే తపాలా ఉద్యోగ సంఘాలు హక్కుల కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసేయన్నారు. అదే స్ఫూర్తితో నేటి ప్రభుత్వ నియంతృత్వ పోకడలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు లక్ష్మీపతి మాట్లాడుతూ 80 శాతం ఉద్యోగులు సభ్యులుగా ఉన్న ఈ రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం అన్యాయమన్నారు. దీన్ని ఐక్యంగా ఎదుర్కొనాలన్నారు. తపాలా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన కాలంలో తపాలా ఉద్యోగ సంఘాలు ఎన్నో పోరాటాలు చేశాయన్నారు. అదే విధంగా గుర్తింపు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుబంధంగా ఉన్న ఒక గుర్తింపు లేని ఉద్యోగ సంఘం ఇచ్చిన పిర్యాదు మేరకు రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం కక్ష్యసాధింపు చర్య అని వ్యాఖ్యానించారు. రైల్వే ఉద్యోగ సంఘాల నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2014 నుంచి ఉద్యోగ, కార్మిక సంఘాలను అణచివేసే కుట్ర జరుగుతుందన్నారు. బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతోందన్నారు. తపాలా ఉద్యోగుల పోరాటానికి ఇన్సూరెన్స్, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, రైల్వే, కార్మిక యూనియన్ల మద్దతు ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా యూనియన్ ప్రెసిడెంట్ యుజి.ప్రకాష్, తపాలా ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్ఐసి యూనియన్ నాయకులు సతీష్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ హెచ్చరించారు. దొండపూడి పంచాయతీ పరిధిలోని సాగిపాడు శివారు శ్మశానం భూమి ఆక్రమణకు గురైంది. దీంతో ఆక్రమణ దారుని నుంచి రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించారు. సాగిపాడు శివారులో 79 /1 సర్వే నెంబరులో 3.96 ఎకరాల శ్మశానం భూమిని తణుకు వేములయ్య ఆక్రమించుకుని సాగు చేస్తున్నాడు. 2012లో ఈ భూమికి పట్టా ఉందని, ఈ భూమి తనదేనంటూ 2019లో హైకోర్టును ఆశ్రయించాడు. అదే గ్రామానికి చెందిన దాట్ల నారాయణరాజు శ్మశానం ఆక్రమణకు గురైందని, దీన్ని పంచాయతీకి అప్పగించాలని 2020లో హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జెసి ఈ భూమిని పరిశీలించారు. విచారణ చేపట్టారు. ఈ భూపట్టాకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఎటువంటి వివరాలు లేవని, నకిలీ పట్టాగా అధికారులు గుర్తించారు. దీంతో న్యాయస్థానం ఆదేశాలు అనుసారం తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ తన సిబ్బంది, పోలీసు సహాయంతో భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించారు.

పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన

ప్రజాశక్తి -గోకవరం

పర్యవరణ హిత జీవన విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అటవీ శాఖ సెక్షన్ అధికారి పి.వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని కామరాజుపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అవగాహన కల్పించారు. పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంధనం పొదుపు, ప్లాస్టిక్ వాడకం తగ్గిపు, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి వాటిని ఆచరించాలన్నారు. నీటిని వృథా చేయకూడదని ప్రతి ఇంటి వద్ద నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలాన్నరు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎయిర్ కూలర్లు వాడకం తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకం తగ్గించి గుడ్డ సంచులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ బీట్ అధికారి డి.కామేశ్వరరావు ఉపాధి కూలీలు పాల్గొన్నారు

చాగల్లు పిహెచ్‌సి సందర్శన

చాగల్లు : చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎల్ఎటిఒ ఎన్.వసుంధర దేవి బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించారు. మండలంలోని నేలటూరు సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వసుంధర దేవి మాట్లాడుతూ అంగన్‌వాడి సెంటర్లలో పిల్లల పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు, సిరప్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఇ.తనూజ, సిహెచ్‌ఒ సుధీర్, హెచ్‌వి.ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ కోట నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో చలివేంద్రం ప్రారంభం

చాగల్లు : మండలంలో మల్లవరంలో సుశీల వృద్ధాశ్రమంలో వాడపల్లికి చెందిన కరుటూరి వెంకట్రావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ మంత్రి ఎఎస్.జవహర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారులకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లంకసాని భద్రం, బూరుగుపల్లి వీరరాఘవులు, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష, కోడూరి కాశి, బండి శ్రీను, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అధికప్రాధాన్యత

కడియం : విద్యార్థులు, యువకులు క్రీడలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వివిధ రకాల క్రీడా సామగ్రి అందిస్తుందన్నారు. వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని దుళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు క్రికెట్ కిట్, వాలీబాల్, ఫుట్ బాల్, షటిల్ తదితర క్రీడా సమాగ్రిని ఆయన పిఎంసి చైర్మన్ నూలు సోమేశ్వరరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోకల శ్రీనివాస్, వైసిపి నాయకులు సన్నపు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.


క్రమబద్ధీకరణ కోసం ఎంపీకి వినతి

రాజమహేంద్రవరం : తమ సర్వీసు క్రమబద్ధీకరణ త్వరితగతిని చేపట్టాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్ల మాణిక్యం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ని కోరారు. శుక్రవారం శుభమస్తు కళ్యాణ మండపంలో జరిగిన జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీని కాంట్రాక్టు లెక్చరర్లు కలిశారు. 23 ఏళ్లుగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే బడుగు బహీనవర్గాలకు చెందిన వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది ప్రభుత్వ కళాశాలను కాపాడుకుంటూ వచ్చామన్నారు. కాని తాము మాత్రం శ్రమ దోపిడీకి గురవుతూవస్తున్నామని వాపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 142,143 జిఒల ద్వారా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా చేరామన్నారు. తమతో పాటుగా చేరి తెలంగాణా కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీసుని ఇటీవలనే రెగ్యులర్ చేస్తూ అక్కడ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీసు వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. ఎంపీ మాట్లాడుతూ కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీసు రెగ్యులరైజేషన్ విషయంలో సిఎం ఆదేశాలిచ్చారని, త్వరలో శుభవార్త వింటారన్నారు. ఈ కార్యక్రమంలో పి.సూర్యనారాయణమూర్తి, ఎ.శ్రీనివాసరావు తదతరులు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేకతను టిడిపి ఓటుగా మలచాలి'

నిడదవోలు : వైసిపిపై ఉన్న ప్రజావ్యతిరేకతను టిడిపి అనుకూల ఓటుగా మార్చేందుకు ప్రతి కార్యకర్త కషి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం ముగింపు సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగాంగా నియోజవర్గంలో పర్యటిస్తుండగ ప్రజలే ఎదురొచ్చి సమస్యలను తెలపడం చూస్తుంటే జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత అర్థమవుతుందన్నారు. ధరల పెరుగుదలతో ప్రజలు విసిగిపోయారన్నారు. నిర్మాణ రంగం కుంటుపడటంతో కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగన సూర్యారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు భూపతిరాజు రవివర్మ, పెరవలి మండల అధ్యక్షులు అతికాల రామకృష్ణమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకంలో నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. రీసర్వే, ఇంటి స్థలాలు, పర్యాటకం, వ్యవసాయ అనుబంధ శాఖల పనితీరుపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్‌భరత్ ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. పంచాయితీ స్థాయి వరకు లాగిన్‌లు ఇచ్చామన్నారు. పిఎంయులు, ఆడిట్ టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూ అంశాలకు చెందిన అర్జీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మండలాల్లో ఏర్పాటైన ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లలో ఎస్‌హెచ్‌ఒలు, తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు చాలా వరకు పరిష్కారం చేశారన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాధవీలత అధికారులతో మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తప్పనిసరిగా బియాండ్ ఎస్‌ఎల్‌ఎకు వెళ్లకుండ సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పునాది పడిన నిర్మాణాలకు పొదుపు సంఘాల ద్వారా అదనపు రుణం అందేలా చూడాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. వర్షాకాలంలోపు గహ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సామూహిక గహ ప్రవేశాలు తొందరలోనే ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో పురోగతి ఉండాలని సూచించారు.జిల్లాలో చేపడుతున్న జగనన్న భూహక్కు - భూ రక్ష రీసర్వేను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులు భూసేకరణకు చెందిన పరిహారం జిల్లాకు అందిన మొత్తాన్ని త్వరితగతిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద కస్టమర్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు మెషినరీ సబ్సిడీపై అందించి, ఆర్‌బికె స్థాయిలో అందుబాటులో ఉంచి తక్కువ అద్దెతో వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, జిల్లా హౌసింగ్ అధికారి పరశురామ్, జిల్లా పశుసంవర్థక శాఖా అధికారి ఎస్‌జివి.సత్యగోవింద్, వ్యవసాయశాఖ జెడి ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి ఇతర అధికారులు

హోం మంత్రిని కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

రాజమహేంద్రవరం ట్రాఫిక్ డిఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వెంకటేశ్వర్లు హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనితను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హోం మంత్రిక్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అభినందనలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన డిఎస్‌పిల బదిలీల్లో భాగంగా వెంకటేశ్వర్లు విజయనగరం దిశ స్టేషన్ నుంచి బదిలీపై రాజమహేంద్రవరం ట్రాఫిక్‌కి వచ్చారు. ఈ క్రమంలో డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా హోం మంత్రిని కలిసి మాట్లాడారు.

నేరాలు ఘోరాలు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కాజులూరు

అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. స్థానికులు కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం కౌలు రైతు గుండుపల్లి ఆంజనేయులు(42) 20 సంవత్సరాలుగా కౌలుకు వ్యవసాయం సాగు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత ఐదు సంవత్సరాలుగా నష్టాల బారిన పడ్డాడు. 7 లక్షల వరకు అప్పులు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల కాలంలో అప్పులు ఇచ్చిన వారి నుండి తీవ్ర ఒత్తిడి పెరగడంతో బుధవారం మధ్యాహ్నం కూల్ డ్రింకులో పురుగులు మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందాడు. మతుడు ఆంజనేయులుకు భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. మతుని కుటుంబాన్ని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు పరామర్శించారు. ప్రభుత్వం ఆంజనేయులు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

రోడ్డు ప్రమాదంలో గురువారం మహిళకు గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామానికి చెందిన ఈరేటి మంగమ్మ, ఆమె భర్త శ్రీను మోటార్ సైకిల్ పై జగ్గంపేట వైపునకు వెళుతున్నారు. వారు మల్లేపల్లి గ్రామశివారు వద్దకు వచ్చేసరికి జగ్గంపేట వైపు వెళుతున్న సమయంలో లారీ డ్రైవర్ వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై ఉన్న తీవ్ర గాయమైంది ఆమె కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లుగా వచ్చిన ఫిర్యాదు పై గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు


అదుపులోనికి తీసుకున్న నిందితులతో గండేపల్లి పోలీసులు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఏజెన్సీ ప్రాంతం చింతపల్లి నుంచి బాపట్లకు రెండు మోటార్ సైకిల్ పై 21 కేజీల గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను గురువారం గండేపల్లి వద్ద పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాలు ఇవి.. గండేపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేసిన సమయంలో నలుగురు వ్యక్తుల్ని అదుపులో తీసు కున్నారు. ఎస్ఐ గణేష్ కుమార్, సిఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో నలుగురు వ్యక్తులను విచారణ చేశారు. రూ.రెండు లక్షల విలువైన గంజాయిని రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వ్యక్తులు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.రెండు లక్షల విలువ చేసే గంజాయి 3 సెల్ ఫోన్లు రెండు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సిఐ తెలిపారు.


ఇసుక అక్రమ రవాణా

ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని పోతవరం, పోతునీడుపాలెం, కవులూరు, నబీపేట, అనంతపల్లి, గ్రామాల వెంబడి ఉన్న ఎర్ర కాలువ నుండి అక్రమార్కులు ఇసుకను తవ్వి తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని పలువురు అంటున్నారు. రోజుకు మండలవ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 ట్రాక్టర్ల వరకు ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. గ్రామాల్లో ఇల్లు కట్టుకునే వారికి చేరడంత ఇసుక కరువైపోగా పక్క మండలాల్లోని గ్రామాలకు స్థానికంగా ఉన్న ఎర్రకాలు నుండి ఇసుక తరలిపోతోంది. ఇసుక తరలించేందుకు ప్రభుత్వం నుండి ఏ విధమైన పర్మిషన్లు లేనప్పటికీ రాత్రీ పగలూ తేడా లేకుండా అక్రమార్కులు ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఎదురుపడిన వారికి ఎంతో కొంత చేతులు తడిపి రోజుకు రూ.వేలకు వేలు కూడ పెడుతున్నారు. ఒక ట్రక్కు ఇసుక నాలుగు వేల నుంచి డిమాండ్ ను బట్టి ఐదువేల వరకు అమ్ముతున్నారు ఈ విధంగా ఒక్కో ట్రాక్టర్ యజమాని రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు. గతంలో పోలీసు అధికారులు రెవెన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్ కనిపిస్తే కేసు రాసేవారు ప్రస్తుతం పట్టపగలే వారి కళ్ళముందే ఇసుక ట్రాక్టర్లు వెళుతున్న పట్టించుకోవడంలేదని ప్రజల్లో విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా దారులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీ సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - సీతానగరం

విశాఖలో ఈ నెల 21న జరిగే అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని రైతుకూలీ సంగం జిల్లా కార్యదర్శి పల్ల వెంకటనాయుడు పిలుపునిచ్చారు. గురువారం చీపురుపల్లిలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అభివృద్ధి పేరుతో అడవి నుంచి గెంటేసే కుట్ర చేస్తున్నాయన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. బిజెపి- ఆర్ఎస్ఎస్ కూటమి ఆదివాసి చట్టాలను సవరణల పేరుతో మార్పు చేసి బడా కార్పొరేట్ కంపెనీలకు అటవీ సంపదను ధారాదత్తం చేస్తుందన్నారు.

కేబుల్ ఆపరేటర్లతో కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో ఉన్న కేబుల్ ఆపరేటర్లతో మున్సిపల్ కమిషనర్ గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు యానాం మునిపల్ కమిషనర్ గోయల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్ఒ డివిరాజుతో పాటు స్కైవిజన్ కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోయల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సదర్భంగా ఎంఎస్ఒ డివిరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ టాక్స్ పేరుతో తీసుకువచ్చిన జిఎస్‌టి అనంతరం దేశంలో ఎక్కడా వినోదపన్నును వసులు చేయడం లేదని అప్పటినుండే టాక్స్ నిలుపుదల చేసినట్టు చెప్పారు. తాను ఇప్పటికి మున్సిపాలిటికి సహకరించేందుకు సిద్ధంగానే ఉన్నానని అయితే కొందరు ఉద్యోగులు తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. నెట్‌వర్క్ పూర్తిగా డిజిటల్ అని దీనికి సంబంధించిన యాప్ మున్సిపాలిటికి ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజన్ ఖండపల్లి రామకృష్ణ, ఎఇ మేడిశెట్టి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఆర్యాపురం బ్యాంకు వద్ద మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రధాన శాఖ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, ఇలాంటి సమయంలో ప్రజలు, బాటసారులు, ఖాతాదారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్న బ్యాంకు పాలకవర్గం సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ గిరజాల రామకృష్ణతులసి, గిరజాల వీర్రాజు, డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, నక్కెళ్ల బాబూరావు, యర్రా ప్రసాద్, పెంకే సురేష్, పతివాడ రమేష్ బాబు, రాయుడు గణేష్, వీణమ్ వెంకటేశ్వరరావు, గొర్రిపాటి లీలా గంగాధరరావు, బ్యాంకు కార్యదర్శి కొండేటి స్వరాజ్యలక్ష్మి, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు మజ్జి అప్పారావు, టికె.విశ్వేశ్వరరెడ్డి, ఎన్‌వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్

పెట్రోల్ బంకుల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పెట్రోల్ బంకులపై పలువురి ఫిర్యాదుల నేపథ్యంలో జెసి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నగరంలో పలు పెట్రోల్ బంకుల్లో తనిఖీ చేపడుతున్నట్లు డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు తెలిపారు. గురువారం జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు, మండల సప్లయీస్ ఆఫీసర్ ప్రభాకర్‌తో కలిసి నగరంలోని పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ పెట్రోల్ బంకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రజలకు గాలి, నీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉచితంగా అందించాలన్నారు. బంకు సిబ్బంది వినియోగదారులకు అసౌకర్యం కలిగించకుండా, గౌరవంతో మెలగాలన్నారు. శామ్యూల్‌రాజు మాట్లాడుతూ పెట్రోల్ కొలతల విషయంలో కచ్చితంగా మీటర్లు ఉండాలని, దేశవ్యాప్తంగా అన్ని బంకుల్లో ఆధునిక టెక్నాలజీ ద్వారా మీటర్లు అమర్చబడ్డాయని, వినియోగదారులు అపోహలు నమ్మొద్దన్నారు. తనిఖీల్లో ఎక్కడా తేడా రాలేదన్నారు. ఫిర్యాదులు వస్తే కచ్చితంగా తనిఖీ చేసి చర్యలు చేపడతామన్నారు.


ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న చింతా శివ

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

తాళ్ళరేవు బైపాస్ రోడ్ లో ఇటీవల ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు, క్షతగాత్రులకు యానాంకు చెందిన చింతా శివ ఆర్థిక సాయం అందించారు. రూ.10 వేలు చొప్పున అందచేశారు. చింతా గణేష్ సమకూర్చిన ఈ మొత్తాన్ని ఆయన సోదరుడు శివ బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. కాకినాడలోని ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను శివ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంచాల జిమ్మి, నిమ్మకాయల శ్రీనివాస్, చింతం అజయ్‌కుమార్, ఏరుబండి స్వామి, పెంటపాటి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐ

ట్రాఫిక్ నిబంధనలపై కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ వాహనదారులకు, పాదాచారులకు, వ్యాపారస్తులకు గురువారం కరపత్రాలు పంచారు. యానాం పోలీస్ శాఖ ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో సిఐ షణ్ముగం అధ్యక్షతన స్థానిక కె.జంక్షన్, పాత బస్టాండ్, న్యూ బస్టాండ్‌లో ప్రజలకు ప్రమాదాల నివారణపై సూచనలు చేశారు. రహదారి నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు,క్రైమ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



నిరసన తెలుపుతున్న సిఐటియు సభ్యులు

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - యానాం

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బిజెపి పార్లమెంటు సభ్యుడైన బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ క్రీడాకారులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 25 రోజులుగా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్ల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 39 కేసుల్లో నిందితునిగా ఉన్న బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణం అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించి, సుప్రీంకోర్టు లేదా హై కోర్టు న్యాయమూర్తిలతో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల వాసు, రమేష్, యాదల శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, కె.సత్యనారాయణ, తిరుకోటి శ్రీనివాస్, గణేష్, సోమరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రులను పరామర్శించిన ఎంఎల్ఎ అశోక్

క్షతగాత్రులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - యానాం

తాళ్లరేవు బైపాస్ వద్ద ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం పరామర్శించారు. డాక్టర్లను క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోరుకునే వరకు వైద్య సేవలు కొనసాగించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. అనంతరం క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో అయన మాట్లాడారు. ఎవరూ అధైర్య పడవద్దని మీకు అండగా ఉంటానని, అందరూ కోలుకుంటారని భరోసానిచ్చారు.

యానాంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక యానాం టాక్సీ స్టాండ్ వద్ద గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజుకొకరు చొప్పున మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సభ్యులను టాక్సీ స్టాండ్ యూనియన్ ప్రెసిడెంట్ కెవివి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు కుంచే సత్యనారాయణ, ఇళ్ల వాసు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పాల్గొని వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రేవు విష్ణు, మధు, సత్తిబాబు, కె.సత్యనారాయణ, తిరుకోటి శ్రీను, శ్రీను, శీలం సత్యనారాయణ పాల్గొన్నారు.

21న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 21న ఆదివారం అన్ని వ్యాధులకు సంబంధించి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక మహాత్మా గాంధీ బాయ్స్ హై స్కూల్లో ఏర్పాటు చేస్తున్నట్టు లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలోనిఖరీఫ్ పంటకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం అమలాపురం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో పెండింగ్ లో ఉన్న, ప్రస్తుతం జరుగుతున్న ఇరిగేషన్ పనులపై తదితర అంశాలపై అధికారుల తో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ తాగు నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చోట త్రాగునీటిని ప్రత్యేక వాహనాలతో సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ పనులకు సంబంధించి సాధ్యమయ్యే ప్రాంతాలలో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు ఉపాధి హామీ పనుల తో అనుసంధానం చేసుకొని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ కు సాగునీటిని విడుదల విషయం లో ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. జిల్లా లో షట్టర్లు, ఔట్ ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతు పనులు, కాలువ ల పూడిక తీత పనులకుసంబంధించి ప్రతిపాదనలు ఏమైన ఉంటే వెంటనే కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సుబ్బయ్య (డ్రెయిన్లు), కాశీ విశ్వవేశ్వరరావు (హెడ్‌వర్క్స్), విజయ గోపాల్ (ఈస్టన్ డివిజన్) డి.రామ్‌గోపాల్ (సెంట్రల్ డివిజన్), డ్వామా పీడీ మధుసూధన్, ఎస్ఇ పంచాయతీ రాజ్ చంటి బాబు, సిపిఒ వెంకటేశ్వర్లు, ఎస్ఇ ఆర్‌డబ్ల్యూఎస్ కష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - అంబాజీపేట

మండలంలోని మాచవరం శివారు పోతాయిలంకలో గురువారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కొప్పిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన తాటా కిల్లు కాలి బూడిదయ్యాంది. ఈ అగ్నిప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారు. శ్రీనివాస్ ఇంటి అటుకపై కొప్పిశెట్టి బాల వెంకట రమణకు చెందిన 15 వేల కురిడీ కొబ్బరి కాయ ప్రమాదంలో కాలిపోయాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.1.50 లక్షలు విలువ చేసే కొబ్బరి కాయలతో పాటు రూ.50 వేలు విలువ చేసే గహోపకార వస్తువులు కాలిబూడిదయ్యాయి. రూ.2లక్షలు ఆస్థి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.


బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబానికి ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బియ్యం, నిత్యవసరాలు పంపిణీ చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ దొమ్మేటి సత్యమోహన్,విత్తనాల శేఖర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం గడప..గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని మెర్లపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసు కుంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

ఉప్పలగుప్తం వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరిందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని భీమనపల్లిలో గురువారం నిర్వహించారు. ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

అప్పుల బాధ తాళలేక ఈ నెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన బొబ్బిల్లంకకు చెందిన కాకర్ల త్రిమూర్తులు(40) బుధవారం మృతి చెందాడు. త్రిమూర్తులు హైదరాబాదులో రెండు రెస్టారెంట్లను నడుపుతున్నాడు. వీటి నిర్వహణ కోసం పలుచోట్ల అప్పులు చేశాడు. వీటిని తీర్చలేక స్వగ్రామమైన బొబ్బిలంకకు వచ్చాడు. ఈ నెల 13న తెల్లవారుజామును కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కాకినాడ జిజిహెచ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్ని ప్రమాదంలో ఏడు పశువుల దహనం

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని చోడవరం గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు గేదెలు, ఒక మేక సజీవ దహనం అయ్యాయి గుర్తుతెలియని వ్యక్తులు పశువులపాకకి నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని రైతు మద్దిపాటి శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాప సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. సుమారు 5 లక్షల వరకూ నష్టం వాటిల్లిందన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

తూ॥గో॥జిల్లా, పిడింగొయ్యి ఎస్.ఆర్.ఓ., రాజమహేంద్రవరం రూరల్, కోలమూరు, **ఆర్.ఎస్.నెం. 699/3ఎ,** సమీప డో.నెం. 5-45 వద్ద లే-అవుట్ ప్లాట్ నెం.3, చ॥గ॥241-10 **రిజిష్టర్డు దస్తావేజు నెం.1745/2013, తేదీ 23-03-2013తో** గలది **ది. 15-05-2023వ** తేదీన ఉదయం 11 గంటలకు నా భర్తతో డో.నెం.10-15, కళ్యాణ్ నగర్, 5వ వీధి, కొంతమూరు నుండి మోటారు సైకిల్‌పై సదరు దస్తావేజును కొంతమూరు సెంటరుకు తీసుకుని వెళ్ళు చుండగా మార్గమధ్యమంలో పడిపోయినది. ఎంత వెతికిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికినచో నాకు తెలియజేయండి. రాజమండ్రి, ది.17-5-2023.

ఉండమట్ల వెంకట వరజయలక్ష్మి
సెల్: 94904 78448

పడిపోయినవి

తూ॥గో॥జిల్లా, కంటిపూడి వీధి, అమ్మిరెడ్డి భవనం, డో.నెం. 25-1-1, రాజమండ్రిలో నివసిస్తున్న కంటిపూడి శార్వాణి, తండ్రి: కంటిపూడి వెంకట రత్నం అను నాయొక్క బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, **మార్చి 2010వ సీరియల్ నెం. 1046589, రిజిష్టర్డు నెం. 1003213538 కంటిపూడి శార్వాణి** పేరున గల మార్కులిస్టు మరియు ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ **సీరియల్ నెం. 039976, రిజిష్టర్డు నెం. 710165905032, జూన్ 2013** మంజూరు చేసిన బ్యాచులర్ ఆఫ్ సైన్స్ సర్టిఫికెట్ ది.15-05-2023వ తేదీన నేను ఇంటి నుండి దేవీచౌక్ జిరాక్సు నిమిత్తం వెళ్ళు చుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా కనపడలేదు. కనుక పైన తెలిపిన మార్కులిస్టులు దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చవలసినదిగా కోరుచున్నాను.

కంటిపూడి శార్వాణి
తండ్రి: కంటిపూడి వెంకట రత్నం, డో.నెం.25-1-1, కంటిపూడి వీధి, అమ్మిరెడ్డి భవనం, వి.టి.సి.రాజమండ్రి. సెల్: 88856 55927

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
O.S.NO. 1425 OF 2020

Between:
Union Bank of India,
(erstwhile Andhra Bank merged in UBI)
Credit Card Division,Koti, Hyderabad,
represented by the Senior Manager (Law)
..Plaintiff

And

D1 Sri Nalla Venkata Narasaiah,
S/o.Sri N. Satyanarayana Murthy,
aged about 45 years R/o.D.No.70-7-28/1,
Near Krishnanagar Park, Bank Colony,
Kakinada- 533005, E.G. District, A.P
D2 Smt. Nalla Raja Ratna Chakra Surya Kumari ,W/o.Sri Nalla Venkata Narasaiah,
aged about 45 years, R/o.D.No.70-7-28/1,
Near Krishnanagar Park, Bank Colony,
Kakinada- 533005, E.G. District, A.P
...Defendants

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.1,29,210-47Ps (Rupees One lakh twenty nine thousand two hundred and ten and paise forty seven only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to 30-06-2023 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,
West Prasanthnagar Colony,
Moosarambagh, Hyderabad-500 036

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
O.S.No. 2071 OF 2022

Between:
Union Bank of India,
(erstwhile Andhra Bank merged in UBI)
Credit Card Division, Koti, Hyderabad,
represented by the Manager
plaintiff

AND

Smt. Simhachalam,
W/o. Sri Vajrapukondala, aged about 61 years, Occ: Retired Government Teacher,
R/o.Muralikonda, near Current Office
1-228A, Bommuru, Rajahmundry-533124.
...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,16,068-91Ps (Rupees Two lakhs sixteen thousand and sixty eight and paise ninety one only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to 08-06-2023 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,
West Prasanthnagar Colony,
Moosarambagh, Hyderabad-500 036

PUBLIC NOTICE

This Public Notice is given on instructions of my client **GONAMANDA RAJASEKHAR, S/o. VASANTHARAO,** Resident of D.No. 5-1, Kadali Village, Razole Mandal, Dr.B.R. Ambedkar Konaseema District.

1) My client borrowing loan from **M/s. CHOLAMANDALAM INVESTMENT AND FINANCE COMPANY LIMITED (CIFCL),** Amalapuram Branch, 1. Gonmanda Vasantharao has got ancestral property. While enjoying by him, he died intestate, leaving behind his family menbers by name 1. Gonamanda Babypadmavathi (Wife), 2. Gonamanda Rajasekhar (Son) and 3. Barthi Nirosha (Daughter) and they are enjoying the property.
2) While enjoying by Gonamanda Babypadmavathi, she along with Barthi Nirosha executed Registered Sale Deed in favour of Gonamanda Rajasekhar on 17-03-2023, under Document No. 1107/2023 for the schedule property.
3) Therefore this Public Notice is issued to all, they any body has claim / right/ objection over the schedule property, they shall come forward with documentary proof within Seven days from the date of this notice to the under signed, else it shall be deemed that there are no claims or objections over the schedule property, and the transaction will be proceeded with.

SCHEDULE: Dr.B.R.Ambedkar Konaseema District, Previously East Godavari District, Razole Sub Registry, Razole Mandal, Kadali Grama Panchayat Area, Kadali Village Zeroit Dry, R.S.No. 531/1C an extent of Ac. 0-12 cents equalant ot 581 Square Yards Site with R.C.C. Building bearing D.No. 5-110in Eastern side Ac. 1-17 cents our of full Ac. 2-38 cents bounded by: ***East:*** Land of Sri Kapotheswara Swamy Temple. ***West:*** Land of Uppe Krishnamurthy. ***South:*** R&B Road. ***North:*** Land of Gosangi Bhulokham. with all easementary rights therein.

By, T.SANTHI KAMALA,
Advocate, Amalapuram-533201,
Dr.B.R.Ambedkar Konaseema Dist.
Cell: 98665 45823

పబ్లిక్ నోటీసు

నాక్లయింటు కొమరగిరిపట్నం, అల్లవరం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపురస్తులు **జగతా మురళీ కృష్ణ గారి కుమారుడు నాగేశ్వరరావు** సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటు M/s. చోళమండలం ఇన్వెస్ట్‌మెంటు అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (CIFCL), అమలాపురం బ్రాంచ్ నందు లోన్ తీసుకొనుచున్నారు. నా క్లయింటు 1) చిక్కం మార్తమ్మ, 2) జగతా పార్వతి, 3) గంగిశెట్టి మంగతాయారు గార్ల నుండి క్రయ దస్తావేజు రీత్యా ది.21-02-2023, డాక్యుమెంటు నెం. 1673/2023 కొనుగోలు చేయబడినది. కావున యావన్మందికీ తెలియజేయునది ఏమనగా ఎవరికైనా అభ్యంతరములు కాని, క్లయిమ్స్ కాని ఏవిధమైన రైటు ఉన్న ఎడల ఈ ఆస్థి పైన వాళ్ళు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేసినవారు 7 రోజుల లోపుగా ఈ క్రింది తెలియజేసిన అడ్రసుకు వార్లు అభ్యంతరాలు పంపించవలెను. లేని ఎడల ఎటువంటి క్లయిమ్స్ ఈ ఆస్థి మీద లేవని గమనించగలరు.

ఆస్థి వివరం: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, లోగడ తూర్పు గోదావరి జిల్లా, అల్లవరం సబ్ రిజిస్ట్రారులో చేరిన అల్లవరం మండలం, కొమరగిరిపట్నం గ్రామ పంచాయితీకి చెందిన కొమరగిరిపట్నం గ్రామం తాలూకు జిరాయితీ మెరక రి.స.నెం 470/1 పూరా య.6-08ట్లులో య.0-31ట్లులో య.0-03ట్లులో అనగా 145.2 చదరపు గజములు భూమికి హద్దులు: ***తూర్పు:*** సిమెంటు రోడ్డు (తరువాత జనతా మురళీ కృష్ణ గారి స్థలం. ***పడమర:*** నడింపల్లి సుబ్బరాజు గారి భూమి. ***దక్షిణం:*** జగతా స్వామినాయుడు గారి ఆర్.సి.సి. డాబా. ***ఉత్తరం:*** ఆకుల వెంకటేశ్వరరావు గారి ఆర్.సి.సి. డాబా. సమస్త ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

టి.శాంతి కమల
న్యాయవాది, అమలాపురం-533201,
డా॥.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
సెల్: 98665 45823